సాక్షి అనంతపురం

శుక్రవారం । 15 । డిసెంబర్ । 2023



ఊరిని మార్చిన ఊటబావులు

తలుపుల మండలం గొల్లపల్లి గ్రామం జల సంరక్షణలో ఉమ్మడి అనంతపురం జిల్లాకే ఆదర్శంగా నిలుస్తోంది. 10లో



కిలో టమాట రూ.20

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.20, కనిష్టంగా రూ.6, సరాసరిన రూ.15 ప్రకారం ధర పలికింది.

గరిష్ఠం/కనిష్ఠం
33.6°/14.6°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం వేళ చలి తీవ్రత స్వల్పంగా పెరిగింది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

రీ సర్వేలో విమర్శలకు తావివ్వొద్దు



డీటీలతో సమీక్షిస్తున్న పర్యవేక్షక అధికారి మారుతి

అనంతపురం అర్బన్: 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష' పథకం కింద జిల్లాలో చేపడుతున్న రీ సర్వేలో విమర్శలకు తావివ్వకూడదని కార్యక్రమ పర్యవేక్షక అధికారి, స్పందన ఇన్‌చార్జ్ మారుతి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో రీ–సర్వే డిప్యూటీ తహసీల్దార్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. రీ–సర్వే డిప్యూటీ తహసీల్దారుకు మేజిస్టీరియల్ అధికారాలు కల్పించిదన్నారు. ప్రతి అంశాన్ని సునిశితంగా పరిశీలించాలని సూచించారు. రైతులను ఏ దశలోనూ ఇబ్బందికి గురి చేయరాదన్నారు. సర్వేపై వారికి అవగాహన కల్పించాలన్నారు. సమస్య వచ్చినప్పుడు తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. పరిష్కారం క్లిష్టంగా ఉన్నప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. సమావేశంలో డీఐఓ వెంకటరత్నం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వార్డెన్లు నిర్లక్ష్యం వీడాలి

అనంతపురం రూరల్: ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల వార్డెన్లు నిర్లక్ష్యం వీడి, పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధనకు కృషి చేయాలని సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన్‌రావు సూచించారు. గురువారం స్థానిక దామోదర సంజీవయ్య భవన్‌లోని సీపీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. డీడీ మధుసూదన్‌రావు మాట్లాడుతూ వసతి గృహాల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు. ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసి, వారాంతపు సెలవుల్లో మాదిరి పరీక్షలు నిర్వహించాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.పరీక్షల భయాన్ని తొలగించేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. చలి ఎక్కువగా ఉన్న తరుణంలో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సహాయ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

మాతా, శిశు మరణాలు నివారించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భ్రమరాంబ దేవి

అనంతపురం మెడికల్: మాతా, శిశు మరణాల నివారణకు కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి ఆదేశించారు. గురువారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. గత నెలలో జిల్లాలోని వివిధ పీహెచ్‌సీ, ఆస్పత్రుల్లో చోటు చేసుకున్న 2 మాతృ, 6 శిశు మరణాలపై డీఎంహెచ్‌ఓ ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైరిస్క్ గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రతి గర్భిణి వివరాలు 12 వారాల్లోపు రిజిస్టర్ చేసుకుని, అన్ని రకాల వైద్య పరీక్షలు, సేవలందించాలన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలకు కనీసం 10 ప్రసవాలు చేయాలన్నారు. మదర్ అండ్ చైల్డ్ హెల్త్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ యుగంధర్ మాట్లాడుతూ రక్తహీనత, గుండె సంబంధిత సమస్యలు, తక్కువ ఎత్తు, ఒక కాన్పు మరో కాన్పు మధ్య ఎక్కువ సమయం ఉన్నా, బిడ్డ పెరుగుదల లేకపోయినా హైరిస్క్ కేసులుగా పరిగణించాలన్నారు. ప్రసవ తేదీకి మూడు రోజుల ముందే ఆస్పత్రిలో చేర్పించాలన్నారు. సమావేశంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్, వైద్యులు డాక్టర్ శంకర్‌నారాయణ, డాక్టర్ నవీన్ కుమార్, గైనకాలజిస్టు డాక్టర్ పార్వతి, ఎంపీహెచ్ఈఓ లక్ష్మణ్ణ, ఎంపీహెచ్ఎస్ హేమలత తదితరులు పాల్గొన్నారు.

నేడు బెళుగుప్పలో 'జగనన్నకు చెబుదాం'

అనంతపురం అర్బన్: 'జగనన్నకు చెబుదాం' మండల స్థాయి కార్యక్రమాన్ని శుక్రవారం బెళుగుప్పలో నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ తెలిపారు. వాసవీ కల్యాణ మండపంలో ఉదయం 9.30 గంటల నుంచి జగనన్నకు చెబుదాం, స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొంటారని వెల్లడించారు. మండల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అర్జీలు అందజేస్తే పరిష్కారం చూపుతామన్నారు.



వణికించే వాతావరణంలో చలి కాచుకుంటున్న దృశ్యం

చలిగింతలు మొదలు

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ఉదయం చలి తీవ్రత క్రమంగా అధికమవుతోంది. వేకువజామున మంచు దుప్పటి వేస్తోంది. ఈ సీజన్‌లో తొలిసారిగాచాలా ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గురువారం శ్రీ సత్యసాయి జిల్లాలోని మడకశిరలో 13.3 డిగ్రీలు, జిల్లాలోని కంబదూరులో 14.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఇక.. సోమందేపల్లి 14.2 డిగ్రీలు, రొద్దం 14.3 డిగ్రీలు, హిందూపురం 14.4, గోరంట్ల 14.6, శెట్టూరు, కొత్తచెరువు 15, కణేకల్లు, బొమ్మనహాళ్, కుందుర్పి 15.1, అమడగూరు, అమరాపురం, కనగానపల్లి, గార్లదిన్నె 15.2, పరిగి 15.3, బుక్కపట్నం, ఉరవకొండ, కూడేరు, నల్లమాడ, డి.హీరేహాళ్ మండలాల్లో 15.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగిలిన ప్రాంతాల్లో 16 నుంచి 19 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ప్రధానంగా మడకశిర, హిందూపురం, రాయదుర్గం, కళ్యాణదుర్గం, పుట్టపర్తి, పెనుకొండ నియోజకవర్గాల్లో చలి ప్రభావం అధికంగా ఉంది. మిగతా నియోజకవర్గాల్లో కాస్త తక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నెలాఖరు నుంచి రాత్రి ఉష్ణోగ్రతలు మరింత పడిపోయే పరిస్థితి ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.



గురువారం తెల్లవారుజామున అనంతపురం నగరంలో పడుతున్న మంచు



పీటీసీలో వాకింగ్ చేస్తున్న నగరవాసులు



బుక్కరాయసముద్రం కొండ చుట్టూ అలుముకున్న పొగమంచు



చలిలోనే ఎద్దుల బండిలో పనులకు..



సర్వజనాస్పత్రిలో నిద్రిస్తున్న రోగుల బంధువులు

ఫొటోలు: డి.మహబూబ్‌బాషా

ఛీడీపీ అంటున్నా!

''నవ్విపోదురు గాక.. మాకేటి సిగ్గు'' అన్నట్లుంది టీడీపీ నేతల తీరు. మునిగిపోయిన టీడీపీ నావను ఎలాగైనా దారిలో పెట్టాలనే ఉద్దేశంతో నీచ రాజకీయాలకు తెర లేపుతున్నారు. జనం ఏమనుకుంటే ఏంటి.. అన్నట్లుగా దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారు. ఎక్కడ ఏ చిన్న విషయం జరిగినా అధికార పార్టీకి అంటగడుతూ.. చివరికి అవన్నీ అవాస్తవాలని తేలాక నవ్వులపాలవుతున్నారు. గత కొన్ని రోజులుగా జిల్లాలో జరిగిన కొన్ని ఘటనలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టంగా తెలుస్తుంది.

- నీచ రాజకీయాలు చేస్తున్న టీడీపీ నేతలు
- ఎన్నికలు సమీపిస్తున్న వేళ మరింత దిగజారుడు రాజకీయాలు
- ఎల్లో మీడియా తోడుగా అధికార పార్టీపై విషం
- ప్రజల నుంచి స్పందన లేక ఆక్రోశం



సాక్షి ప్రతినిధి, అనంతపురం: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక 'సంక్షేమం' వెల్లివిరిసింది. గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు పెద్ద ఎత్తున జరిగాయి. జరుగుతున్నాయి. ఇంటి వద్దకే పథకాలు అందుతుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజకీయంగానూ పెద్దపీట వేయడంతో ఆయా వర్గాల్లో ఆనందం నెలకొంది. కొన్ని రోజులుగా అధికార పార్టీ నిర్వహిస్తున్న సాధికార బస్సు యాత్రలకు బ్రహ్మరథం పడుతున్నారు.

ఓర్వలేని టీడీపీ..

సీఎం వైఎస్ జగన్‌కు ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ప్రతిపక్ష పార్టీల నేతలు రగిలిపోతున్నారు. 'మీ బిడ్డ మంచి చేస్తేనే మళ్లీ ఆశీర్వదించండి' అంటూ ప్రజలను నమ్ముకుని ముఖ్యమంత్రి ముందుకు సాగుతుంటే.. టీడీపీ నాయకులు మాత్రం బురదను నమ్ముకుని నీచ రాజకీయాలు చేస్తున్నారు. ప్రభుత్వంపైనా, పథకాలపైనా, అధికార పార్టీ నాయకులపైనా ఏదో రకంగా బట్టకాల్చి మీద వేసిన చందంగా ప్రవర్తిస్తున్నారు. తమకు వత్తాసు పలికే ఎల్లో మీడియాలో దిగజారి అచ్చేసుకుంటున్నారు. భార్యాభర్తలు గొడవ పడినా, అన్నదమ్ముల మధ్య వివాదం నెలకొన్నా వైఎస్సార్ సీపీ నాయకులకు ఆపాదించి దుష్ప్రచారం చేస్తూ ప్రజలకే వెగటు పుట్టిస్తున్నారు.

ఏమైందయ్యా మీకు..

టీడీపీ నేతలు జేసీ ప్రభాకరరెడ్డి, కాలవ శ్రీనివాసులు, పరిటాల సునీత, పయ్యావుల కేశవ్ ఇప్పటికే ప్రజలకు చులకనైపోయారు. పార్టీలో గ్రూపు రాజకీయాలు, చంద్రబాబు స్కాములు, జైలు పాలు కావడం వంటి పరిణామాలతో జిల్లాలో పార్టీ పరిస్థితి దిగజారి పోయింది. ఇక.. ప్రభుత్వ పరంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతుండడంతో టీడీపీని ప్రజలు పట్టించుకోవడం లేదు. దీంతో ఎలాగైనా ప్రజల దృష్టి మరల్చాలనే దురుద్దేశంతో పచ్చ మీడియా తోడుగా విష ప్రచారం చేస్తున్నారు.

దొంగే దొంగ అన్నట్లుగా..

- ఉరవకొండ నియోజకవర్గంలో వేలల్లో దొంగ ఓట్లు నమోదైనట్టు ఇటీవల తేలింది. ఇవన్నీ తెలుగుదేశం పార్టీ హయాంలో ఎక్కించినవే. అయినా, అధికార పార్టీపై పయ్యావుల కేశవ్ ఆరోపణలు చేసి అభాసుపాలయ్యారు.
- రాయదుర్గం నియోజకవర్గంలో శనగల వ్యాపారి ఐపీ పెడితే దాన్ని మాజీ ఎమ్మెల్యే గురునాథ్ రెడ్డి కుటుంబానికి కాలవ శ్రీనివాసులు అంటగట్టారు.దీన్ని గురునాథ్ రెడ్డి సోదరుడు తీవ్రంగా ఖండించారు. ఉషశ్రీచరణ్ మంత్రి అయ్యాక తొలిసారి కళ్యాణదుర్గం వచ్చిన సందర్భంలో.. ఓ బాలింతకు దారి ఇవ్వక శిశువు మృతిచెందారని కాలువ రాద్ధాంతం చేశారు. సీసీ పుటేజీల్లో చూస్తే ఎక్కడా అడ్డుకున్న దాఖలాలే లేవు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఉండి దిగజారి ప్రవర్తించిన కాలవను ఆ పార్టీ కార్యకర్తలే విమర్శించారు.
- విడపనకల్లులో ఉపాధ్యాయుడు మల్లేష్ ఆర్థిక కారణాలతో ఆత్మహత్యాయత్నం చేస్తే మాజీ మంత్రి పరిటాల సునీత రాద్ధాంతం చేశారు. తమను రాజకీయాలకు వాడుకోవద్దు అంటూ బాధిత కుటుంబం కాళ్లా వేళ్లా పడినా పరామర్శల పేరుతో పత్రికలకెక్కారు.
- తాడిపత్రికి చెందిన జేసీ ప్రభాకర్ రెడ్డి నోటికి అడ్డూ అదుపూ లేకుండా పోయిందన్న విమర్శలున్నాయి. సీఐ సస్పెండ్ అయినా అధికార పార్టీనే అంటారు. అభివృద్ధి పనులు అడ్డుకోవడం, కళాశాల ప్రహరీ కట్టొద్దంటూ అడ్డుకోవడం ఒకటా రెండా.. జిల్లాలో తీవ్ర వివాదాలకు జేసీ కేంద్ర బిందువుగా ఉన్నారు. ఇప్పటికే బస్సుల కొనుగోలులో ఈడీ కేసులను ఎదుర్కొంటున్న ఆయన తాను పవిత్రుడినని.. మిగతా అందరూ అవినీతి పరులని బురద జల్లుతుంటడం గమనార్హం.

పది, ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

అనంతపురం ఎడ్యుకేషన్: పది, ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. మార్చి 1 నుంచి ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 5 నుంచి 20 వరకూ ఉంటాయి. జిల్లాలో మొదటి సంవత్సరం, రెండో సంవత్సరం విద్యార్థులు మొత్తం 35,973 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. పదో తరగతి పరీక్షలు మార్చి 18 నుంచి 30 వరకు పరీక్షలు సాగుతాయి. రెగ్యులర్ విద్యార్థులు 31,369 మంది, ప్రైవేట్ విద్యార్థులు 9,587 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షల షెడ్యూలు రావడంతో విద్యాశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు.

రేపు టౌన్ బ్యాంకులో 'లోక్ అదాలత్'

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక 'ది అనంతపురం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు (టౌన్ బ్యాంకు)' కార్యాలయంలో ఈనెల 16న లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బ్యాంకు సీఈఓ విజయ భాస్కర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మధ్యాహ్నం 3.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. లోక్ అదాలత్‌పై అవగాహనతో పాటు రుణగ్రహీతలకు సంబంధించి సమస్యలను పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.

సులువుగా రిజిస్ట్రేషన్

- నూతన సాఫ్ట్‌వేర్ రూపొందించిన రిజిస్ట్రేషన్ శాఖ
- వేగంగా, పారదర్శకంగా ఆస్తుల రిజిస్ట్రేషన్లు
- ఒకే రోజులో వినియోగదారుల చేతుల్లోకి డాక్యుమెంట్లు!



అనంతపురం రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

- అనంతపురానికి చెందిన రమణ తాడిపత్రిలో నాలుగు సెంట్ల స్థలం కొన్నాడు. బుధవారం (13వ తేదీ) తాడిపత్రి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. అరగంటలో పని అయిపోయింది. మధ్యవర్తులతో పని లేకుండా, అదనపు ఖర్చు కూడా లేకుండానే ప్రక్రియ పూర్తవడంతో రమణ సంతోషం వ్యక్తం చేశాడు.

అనంతపురం టౌన్: స్థిరాస్తుల క్రయ విక్రయాల్లో కచ్చితత్వం కోసం ప్రభుత్వం సరికొత్త సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి తీసుకొచ్చింది. కంప్యూటర్ ఎయిడెడ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ (కార్డ్) సాఫ్ట్‌వేర్‌ను మరింత ఆధునీకరించి కార్డ్ ప్రైమ్ 2.0కు రూపకల్పన చేసింది. ఈ విధానంలో ఆస్తుల రిజిస్ట్రేషన్లు చక చకా జరిగిపోతున్నాయి. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో మాన్యువల్ విధానానికి స్వస్తి చెబుతూ ఇప్పటికే రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియ సాగుతోంది. ఈ క్రమంలోనే ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా ఆన్‌లైన్‌లోనే పూర్తి చేసుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

డాక్యుమెంట్లతో పనిలేదు

రిజిస్ట్రేషన్‌కు వెళ్తే క్రయ, విక్రయదారులకు నిమిషాల వ్యవధిలోనే వేగవంతంగా సేవలు అందుతున్నాయి. ఎక్కడా సమయం వృథా కావడం లేదు. గతంలో స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ జరగాలంటే ఎన్నో డాక్యుమెంట్లు తీసుకెళ్లాల్సి వచ్చేది. కొత్త సాఫ్ట్‌వేర్‌తో ఆ అవస్థలన్నీ తప్పాయి. డాక్యుమెంట్లు కొనుగోలు చేయాల్సిన పనిలేదు. దస్తావేజుల అవసరమే ఉండదు. వివరాలన్నీ ఆన్‌లైన్‌లోనే పూరించి స్లాట్ బుక్ చేసుకుంటే చాలు. ఆ సమయానికి కార్యాలయానికి వెళ్లి మొబైల్ ఫోన్లకు వచ్చిన ఓటీపీలు చెబితే అధికారులే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేస్తారు.

అదేరోజు డాక్యుమెంట్ల అందజేత!

గతంలో స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత డాక్యుమెంట్లను వరుస సంఖ్యలో స్కాన్ చేయాల్సి ఉండేది. దీంతో రిజిస్ట్రేషన్ పూర్తి అయిన వారం రోజులకు కొనుగోలుదారులకు డాక్యుమెంట్లు చేతికందేవి. కొత్త పద్ధతిలో రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే అదే రోజు సాయంత్రంలోపు డాక్యుమెంట్లు తీసుకోవచ్చు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 21 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రారంభంలో ఒకటి రెండు రిజిస్ట్రేషన్లు జరిగేవి. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని సందేహాలను తీర్చడంతో సిబ్బంది నేడు స్లాట్ బుక్ చేసుకున్న వినియోగదారులందరికీ సేవలను సకాలంలో అందిస్తున్నారు.

అంతా పారదర్శకం

నూతన రిజిస్ట్రేషన్ విధానంలో ఆధార్‌లింక్‌తో రిజిస్ట్రేషన్ సేవలను అనుసంధానం చేశారు. దీంతో అసలు వ్యక్తులు లేకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరగదు. ఆధార్‌కార్డులో ఉన్న బయోమెట్రిక్ వివరాలతో సరిపోల్చడమే కాకుండా ఈ–కేవైసీ కూడా పూర్తి చేస్తారు. దీంతో మోసాలకు తావుండదు. ఈజీగా సాగిపోతున్న నూతన విధానంపై క్రయ విక్రయదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మధ్యవర్తులతో పనిలేదు

స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను క్రయ, విక్రయదారులకు చేరువ చేసేందుకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ నూతన సాఫ్ట్‌వేర్ రూపొందించింది. అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేస్తోంది. ఎలాంటి అవకతవకలు లేకుండా పారదర్శకంగా సేవలందిస్తున్నాం. కొత్త విధానంలో మధ్యవర్తుల అవసరం ఉండదు.
– జి.భార్గవ్, జిల్లా రిజిస్ట్రార్

ప్రజలతో మర్యాదగా మెలగండి



నేర సమీక్షకు హాజరైన పోలీసు అధికారులు



మాట్లాడుతున్న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

అనంతపురం క్రైం: ప్రజలతో మర్యాదగా మెలగాలని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ సూచించారు. గురువారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో సీఐ, ఆపై స్థాయి పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేర తీవ్రత ఎక్కువ ఉన్న కేసుల్లో దర్యాప్తు త్వరితగతిన ముగించి, కోర్టుల్లో నంబర్లు తీసుకోవాలన్నారు. కేసులు వీగిపోకుండా చూసి, బాధితులకు న్యాయం చేయాలన్నారు. చీటింగ్, దొంగతనాల కేసులను కచ్చితంగా ఛేదించాలన్నారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచి, సత్ప్రవర్తన తీసుకురావాలన్నారు. ఫ్యాక్షన్ ప్రభావిత, సమస్యాత్మక ప్రాంతాల్లో సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్ పెంచాలన్నారు. ఇసుక, మద్యం అక్రమ రవాణాకు తావివ్వరాదన్నారు. ధాబాల్లో మద్యం తాగేందుకు అనుమతి ఇవ్వరాదన్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి పెట్రోల్ అక్రమంగా ప్రవేశించకుండా పకడ్బందీగా వ్యవహరించాలన్నారు. అసాంఘిక శక్తులను అణగదొక్కాలన్నారు. పోలీసుస్టేషన్‌కు వచ్చే ప్రజల సమస్యలను సావధానంగా విని, చట్ట పరిధిలో పరిష్కారం చూపాలని ఆదేశించారు. 'స్పందన' అర్జీలపై గడువులోగా చర్యలు తీసుకోవాలన్నారు. సెబ్ అదనపు ఎస్పీ జి.రామకృష్ణ, డీఎస్పీలు ఆంథోనప్ప, సీఎం గంగయ్య, నరసింగప్ప, శివారెడ్డి, ట్రైనీ డీఎస్పీ హేమంత్ కుమార్, జిల్లా పోలీసు పరిపాలనాధికారి శంకర్, సూపరింటెండెంట్ శ్రీనివాసులు,లీగల్ అడ్వైజర్ విష్ణువర్ధన్ రెడ్డి, ఎస్పీ సీసీ ఆంజనేయ ప్రసాద్ ఉన్నారు.

నేడు 'ప్రత్యేక స్పందన'

అనంతపురం అర్బన్: కలెక్టర్ గౌతమి ఆదేశాల మేరకు ప్రభుత్వ ఉద్యోగుల కోసం శుక్రవారం 'ప్రత్యేక స్పందన' నిర్వహిస్తున్నట్లు డీఆర్‌ఓ గాయత్రిదేవి తెలిపారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'జగనన్న సివిల్ సర్వీసెస్' ప్రోత్సాహకానికి దరఖాస్తులు

అనంతపురం రూరల్: 'జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహక' పథకానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూదన్‌రావు తెలిపారు. యూపీఎస్సీ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షల్లో అర్హత సాధించిన వారికి ఆర్థికంగా అండగా ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. 2023 మెయిన్స్‌లో అర్హత సాధించిన వారికి రూ. 50 వేల నగదు అందుతుందని వెల్లడించారు. ఈ నెల 19 లోపు jnanabhumi. ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

'ట్రాక్టర్ నగర్'తో 'మహీంద్ర' ఒప్పందం



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ట్రాక్టర్ నగర్ డైరెక్టర్ డాక్టర్ బీఎం నాందేడ్

గార్లదిన్నె: మండల పరిధిలోని దక్షిణ వ్యవసాయ క్షేత్ర వ్యవసాయ యంత్రముల శిక్షణ, పరీక్షణ సంస్థ శిక్షణా విభాగం ఆధునీకరణలో భాగంగా మహీంద్ర లిమిటెడ్ కంపెనీతో అవగాహన ఒప్పందం కుదిరింది. వ్యవసాయ యంత్ర పరికరాలు, ఆధునిక యంత్ర పరికరాలపై విద్యార్థులకు, రైతులకు శిక్షణ పొందేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందని ట్రాక్టర్ నగర్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ బాలాజీమురారీ నాందేడ్ అన్నారు. గురువారం ట్రాక్టర్ నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహీంద్ర కంపెనీ ప్రతినిధులు భరద్వాజ్, సౌమిత్ర చౌదరి, ప్రపుల్లా పాండే హాజరై అవగాహన ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఒప్పందం మేరకు ట్రాక్టర్ నగర్‌లో కంపెనీ యంత్రాలను ఉంచి వాటిపై రైతులకు, టెక్నికల్ విద్యార్థులకు, కంపెనీ ఇంజనీర్లకు, శిక్షణ ఇచ్చేలా ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు.

తపాలా శాఖ ఏఎస్పీగా విజయభాస్కర్



విజయభాస్కర్

అనంతపురం సిటీ: అనంతపురం డివిజన్‌లోని గుంతకల్లు అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్‌గా విజయభాస్కర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. పీలేరులో పోస్టల్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న విజయభాస్కర్‌ను అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టల్‌గా పదోన్నతి కల్పించి గుంతకల్లుకు బదిలీ చేశారు. దీంతో ఆయన మంగళవారం బాధ్యతలు చేపట్టారు.

మోతాదుకు మించి మందుల పిచికారీ వద్దు



మిర్చి పంటను పరిశీలిస్తున్న డీహెచ్‌ఓ హరినాథరెడ్డి, శాస్త్రవేత్త సుబ్రహ్మణ్యం

కూడేరు: పంటల తెగుళ్ల నివారణకు మోతాదుకు మించి మందులు పిచికారీ చేస్తే పురుగులు రోగ నిరోధక శక్తిని పెంపొందించుకొని మరింత చెలరేగే ప్రమాదముందని రైతులను ఉద్యాన శాస్త్రవేత్త సుబ్రహ్మణ్యం, డీహెచ్‌ఓ హరినాథరెడ్డి హెచ్చరించారు. మిరపలో యాజమాన్య పద్ధతులపై కూడేరు మండలంముద్దలాపురంలో గురువారం రైతులకు ఏర్పాటు చేసిన క్షేత్ర స్థాయి అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. వేసవిలో లోతు దుక్కులు చేపట్టాలన్నారు. జొన్న, మొక్కజొన్న పంట సాగు చేసేటప్పుడు 10 సాళ్లకు కంచి పంట వేయాలని తద్వారా తామర పురుగు వ్యాప్తి చెందకుండా ఉంటుందన్నారు. నల్లి పురుగు ఉధృతి తగ్గిందని, ఈ క్రమంలో నల్లి పురుగు ఉందనే ఆందోళనతో బ్యాడిగి మిర్చి రైతులు అధిక మోతాదులో మందులు పిచికారీ చేస్తే ఆర్థిక నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ధనుంజయ, వైస్ ఎంపీపీ సుబ్బమ్మ, జేసీఎస్ మండల కన్వీనర్ దేవేంద్ర, హెచ్‌ఓ నెట్టికంటయ్య, ఫినొలెక్స్ డీలర్ బొమ్మినేని నాగరాజు పాల్గొన్నారు.

ఊరిని మార్చిన ఊటబావులు

ఒకప్పుడు ఆ గ్రామంలో తీవ్ర కరువు పరిస్థితులు ఉండేవి. వర్షాలు బాగా కురిస్తేనే పంటలు పండేవి. లేదంటే నష్టాలు, కష్టాలే. కానీ ఇప్పుడా దిగులు లేదు. ఎటు చూసినా జలసిరులే. ఏడాది పొడవునా పచ్చని పంటలతో గ్రామం అలరారుతోంది. వ్యవసాయంలో సిరుల పంట పండుతుండడంతో గ్రామస్తులు ఆర్థికంగానూ ఎదుగుతున్నారు. పిల్లలను బాగా చదివిస్తుండడంతో వారు మంచి ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారు. క'న్నీటి' కష్టాలను కలసికట్టుగా జయించి ఆదర్శంగా నిలుస్తున్న ఆ గ్రామమే గొల్లపల్లి తండా.

- గొల్లపల్లి తండాలో జలసిరులు
- ఊటబావులతో వ్యవసాయం సుసంపన్నం
- 10 నుంచి 15 అడుగుల లోతులోనే భూగర్భజలాలు
- వ్యవసాయ, విద్య, ఉద్యోగపరంగా రాణిస్తున్న గ్రామస్తులు
- ఆదర్శంగా నిలుస్తున్న తండా





గొల్లపల్లి తండా వద్ద ఊటబావుల్లో పుష్కలంగా ఉన్న నీరు



గొల్లపల్లి తండా ముఖచిత్రం

గ్రామం పేరు	గొల్లపల్లి తండా
మండలం	తలుపుల
మొత్తం కుటుంబాలు	154
జనాభా	520
రైతు కుటుంబాలు	120

సాక్షి, అనంతపురం డెస్క్:

శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండలంలోని గొల్లపల్లి తండా జలసంరక్షణలో ఉమ్మడి జిల్లాకే ఆదర్శంగా నిలుస్తోంది. ఇతర ప్రాంతాల్లో బోరుబావులను నమ్ముకుని వ్యవసాయం చేస్తుండగా..ఇక్కడ మాత్రం ఊటబావులు పంటల సాగుకు ఆధారంగా ఉన్నాయి. సుమారు రెండు దశాబ్దాల క్రితం తండాలో నీటివనరులు లేక తీవ్ర కరువు పరిస్థితులు ఉండేవి. ఊటబావులు అందుబాటులోకి వచ్చాక కరువు తొలగిపోయి ..గ్రామం సస్యశ్యామలంగా మారింది.

చెక్‌డ్యాంతో మొదలై..

గొల్లపల్లి తండాలో 2003 సంవత్సరంలో రూరల్ డెవలప్‌మెంటు ట్రస్టు (ఆర్డీటీ) ఆధ్వర్యంలో తొలి చెక్‌డ్యాం నిర్మించారు. చుట్టుపక్కల పడే వర్షపునీరంతా చెక్‌డ్యాములోకి చేరేలా ఏర్పాటు చేశారు. అలాగే వర్షపునీరు భూమిలోకి ఇంకేందుకు వీలుగా కొండల అంచుల వెంబడి అటవీ శాఖ సహకారంతో కందకాలు తవ్వారు. భూగర్భ జలాలు పెరిగేందుకు ఈ చర్యలు దోహదపడ్డాయి. బోరుబావులు తవ్వితే భూగర్భజలాలు తొందరగా ఇంకిపోయే ప్రమాదం ఉంటుందన్న ఉద్దేశంతో వాటిపై నిషేధం విధించుకున్నారు. ఊటబావుల తవ్వకానికి పూనుకున్నారు. చెక్‌డ్యాం అందుబాటులోకి వచ్చిన తొలి ఏడాదే గ్రామంలో తొమ్మిది ఊటబావులు తవ్వారు. 20–30 అడుగుల్లోనే నీరు సమృద్ధిగా లభ్యమైంది.

58 ఊటబావులు.. 540 ఎకరాలు..

గ్రామ పరిసరాల్లో గతంలో 80కి పైగా ఊటబావులు ఉండేవి. వివిధ కారణాల వల్ల కొన్ని నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం 58 ఊటబావులు అందుబాటులో ఉన్నాయి. 10–15 అడుగుల లోతులోనే నీరు లభ్యమవుతోంది. బావుల కింద సుమారు 540 ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. మామిడి తోటలతో పాటు వేరుశనగ, వరి, చిరుధాన్యపు పంటలు సాగవుతున్నాయి. వంద ఎకరాల్లో సేంద్రియ వ్యవసాయం చేస్తున్నారు. ఒకరిద్దరు రైతులు తేనెటీగల పెంపకం కూడా చేపడుతున్నారు. జలసంరక్షణ, పంటల సాగు అంశాల్లో ఆర్డీటీ సహకారం కొనసాగుతోంది.

పశుసంపదకు ఆలవాలం..

గొల్లపల్లి తండాలో పశుసంపద కూడా చెప్పుకోదగ్గ స్థాయిలో ఉంది. సుమారు 200 ఆవులు, ఆరువేల దాకా గొర్రెలు ఉన్నాయి. గ్రామస్తులు ఇటు వ్యవసాయం, అటు పశుపోషణ ద్వారా ఆర్థికంగా ఎదుగుతున్నారు. సమీపంలోనే కొండలు ఉండడం, నీటికొరత ఏమాత్రమూ లేకపోవడంతో వ్యవసాయానికి, పశుపోషణకు ఢోకా లేదని స్థానికులు చెబుతున్నారు.

ఉద్యోగాల్లో సత్తా..

గ్రామంలో ఉండేది 154 కుటుంబాలు మాత్రమే. అయినప్పటికీ ఉద్యోగులకు కొదువ లేదు. ఏకంగా 68 మంది వివిధ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. వీరిలో 12 మంది డాక్టర్లు ఉండడం విశేషం. గిరిజన గ్రామమైనప్పటికీ ఈస్థాయిలో వృద్ధి సాధించిందంటే జల సంరక్షణలో చిత్తశుద్ధి, సమష్టి చైతన్య స్ఫూర్తే కారణమని స్థానికులు అంటున్నారు.

రోడ్డు నిర్మాణంతో మహర్దశ..

గొల్లపల్లి తండా ఒకప్పుడు మారుమూల గ్రామంగా ఉండేది. కానీ దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో కదిరి–పులివెందుల మధ్య నామాలగుండు మీదుగా రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో తండా రోడ్డు పాయింటుకు చేరింది. రవాణా సౌకర్యాలు మెరుగుపడడంతో తండావాసుల రోజువారీ కార్యకలాపాలకు ఇబ్బందులు తొలగిపోయాయి. పాల విక్రయం, వ్యవసాయోత్పత్తుల మార్కెటింగ్‌కు సులువైన 'మార్గం' ఏర్పడింది.



ఓ రైతు పొలంలో తేనెటీగల పెంపకం



గొల్లపల్లి తండా వద్ద కళకళలాడుతున్న పంటలు



సాగవుతున్న మామిడి తోట

వైఎస్సార్ ఎంతో మేలు చేశారు



గతంలో గ్రామం నుంచి 5 కిలోమీటర్లు వెళ్లి బస్సెక్కాల్సిన పరిస్థితి. వైఎస్ రాజశేఖర రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో కదిరి–పులివెందుల మధ్య నామాలగుండు మీదుగా రోడ్డు వేశారు. దీంతో తండా రోడ్డు పాయింటుకు చేరి రవాణా సౌకర్యాలు మెరుగయ్యాయి. పంట ఉత్పత్తుల విక్రయం సులువైంది. ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి వీలు కలిగింది. – శీనా నాయక్, గొల్లపల్లి తండా

సమృద్ధిగా నీరు



ఒకప్పుడు గ్రామంలో కరువు పరిస్థితులు ఉండేవి. ఇప్పుడా సమస్యే లేదు. గ్రామస్తులు సమష్టిగా తీసుకున్న చర్యలతో నేడు సమృద్ధిగా నీళ్లు లభిస్తున్నాయి. ఏడాది పొడవునా పంటలు పండిస్తున్నాం. పశుపోషణ కూడా కలిసివస్తోంది. పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నాం. అందరం కలిసిమెలిసి సంతోషంగా జీవిస్తున్నాం.

– మనోజ్ఞ నాయక్, గొల్లపల్లి తండా

సాగుకు ఎలాంటి ఇబ్బంది లేదు



ఊటబావులు పంటల సాగుకు ఆధారంగా ఉన్నాయి. వర్షపునీరు భూమిలోకి ఇంకేందుకు వీలుగా కొండల అంచుల వెంబడి అటవీ శాఖ సహకారంతో కందకాలు తవ్వుకున్నాం. భూగర్భజలాలు పెరిగేందుకు ఈ చర్యలు దోహదపడ్డాయి.

– గంగాధర్ నాయక్, టీచర్

జనవాక్కు

కంటి చూపు బాగుపడింది



కూలి పనులతో జీవనం సాగిస్తున్న నాకు కంటి చూపు తగ్గడంతో చాలా ఇబ్బందులు పడ్డాను. ఆస్పత్రికెళ్లి చికిత్స చేయించుకునే ఆర్థిక స్థోమత లేక అలాగే కాలం నెట్టుకొచ్చాను. ఓ రోజు మా ఊళ్లోనే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేస్తే వెళ్లి పరీక్ష చేయించుకున్నా. పరీక్షించిన డాక్టర్లు నన్ను అనంతపురానికి పిలుచుకెళ్లి ఉచితంగా ఆపరేషన్ చేశారు. మందులూ ఉచితంగానే ఇచ్చారు. ఇప్పుడు కంటి చూపు బాగుంది. సీఎం వైఎస్ జగన్ మేలు మరువలేనిది.

– లక్ష్మక్క, ఈస్ట్‌కోడిపల్లి, కళ్యాణదుర్గం

ఇంటి వద్దనే చికిత్స



కూలి పనులతో జీవనం సాగిస్తున్న మాకు ఏదైనా జబ్బులు వస్తే మండల కేంద్రంలోని ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలి. అయితే అంత దూరం వెళ్లలేక ఎలాగోలా కాలం నెట్టుకొచ్చేవాళ్లం. జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత డాక్టర్లే మా ఇళ్ల వద్దకు వచ్చి చికిత్స చేస్తున్నారు. కంటి చూపు మందగించిన నాకు ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా ఆపరేషన్ చేశారు. అంతేకాక ప్రతినెలా 1వ తేదీనే ఇంటి వద్దకే పింఛన్ తెచ్చిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్ సేవలు చాలా బాగున్నాయి. మరో పది కాలాల పాటు ఆయనే సీఎంగా ఉండాలని కోరుకుంటున్నా.

– రామక్క, ఈస్ట్‌కోడిపల్లి, కళ్యాణదుర్గం

జగనన్న వల్లనే బాగుపడ్డాం



ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్న తర్వాతనే మా బతుకులు బాగుపడ్డాయి. నేను సొంతంగా ఇల్లు కట్టుకున్నా. వివిధ పథకాల లబ్ధి చేకూరడంతో ఆర్థిక ఇబ్బందులు తీరాయి. చాలా సంతోషంగా ఉన్నాను. గత ప్రభుత్వంలో పథకాలు సక్రమంగా వర్తించక నానా ఇబ్బందులు పడ్డాం. జగనన్నకు ఎంతో రుణపడ్డాం.

– బోయ సుజాత, పాల్తూరు, విడపనకల్లు మండలం

15 ఏళ్ల నిరీక్షణ ఫలించింది



సొంతిల్లు కోసం 15 ఏళ్లుగా నిరీక్షించాను. ఓ చిన్న గుడిసెలోనే కాలం నెట్టుకొచ్చాం. గత ప్రభుత్వంలో ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నా ఇవ్వలేదు. ఇక మాకు సొంతిల్లు రాదని అనుకున్నాం. జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత వలంటీరే మా ఇంటి వద్దకు వచ్చి వివరాలు తీసుకెళ్లి ఇంటి పట్టా వచ్చేలా చేశాడు. ప్రభుత్వ సాయంతోనే ఇల్లు కూడా కట్టుకున్నాం. ఇప్పుడు సొంతింట్లో ఎంతో సంతోషంగా జీవిస్తున్నాం.

– చక్రెమ్మ, కరుట్లపల్లి, కూడేరు మండలం

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం



చెక్కు అందజేస్తున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం: అనారోగ్య కారణాలతో మృతి చెందిన కానిస్టేబుల్ సురేష్ కుటుంబానికి సహోద్యోగులు అండగా నిలిచారు. 2009 బ్యాచ్‌కు చెందిన సురేష్ కళ్యాణదుర్గం అర్బన్ పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఈ ఏడాది అక్టోబర్ 25న మృతి చెందారు. దీంతో ఆయన కుటుంబానికి అండగా నిలుస్తూ 2009 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుళ్లు రూ.3.53 లక్షలను పోగు చేసి, చెక్కు రూపంలో మృతుడి భార్య సుజాతకు ఎస్పీ అన్బురాజన్ చేతుల మీదుగా గురువారం అందజేశారు. కార్యక్రమంలో సెబ్ అదనపు ఎస్పీ జి.రామకృష్ణ, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

పనితీరుకు ఉత్తమ ప్రశంస

విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసిన 49 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పాటు గ్రామ మహిళా పోలీసులను అభినందిస్తూ ఎస్పీ అన్బురాజన్ ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. గత నెల వివిధ కేసుల దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన వారితో పాటు వివిధ అంశాలపై సమాచారం సేకరించడం, సమస్యాత్మక, ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాల్లో తరుచూ పర్యటిస్తూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు చర్యలు తీసుకున్న వారిని ప్రత్యేకంగా అభినందించారు.

'ఆపస్' రాయలసీమ జోనల్ బాధ్యుడిగా వెంకటేశ్వరప్రసాద్



అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) పశ్చిమ రాయలసీమ జోనల్ బాధ్యులుగా అనంతపురం నగరంలోని పొట్టి శ్రీరాములు స్కూల్‌లో ఇంగ్లిష్ టీచర్‌గా పని చేస్తున్న టి.వెంకటేశ్వరప్రసాద్, ఉమ్మడి జిల్లా పర్యటన కార్యకర్తగా బత్తలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు టీచర్ గా పనిచేస్తున్న బి.రాజేంద్రప్రసాద్ ఎంపికయ్యారు. వీరికి సంఘం జిల్లా అధ్యక్షురాలు కళ్యాణి, ప్రధాన కార్యదర్శి ఎర్రిస్వామి, కోశాధికారి రాఘవేంద్ర గుప్తా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నారాయణస్వామి, సీనియర్ నాయకులు భాస్కరయ్య, మల్లికార్జున రెడ్డి, రాజశేఖర్, గోపీచంద్, కారుమంచి, హర్షవర్ధన్ మహిళా కన్వీనర్ మంజుశ్రీ అభినందనలు తెలిపారు.

అట్టహాసంగా 'పాలిటెక్నిక్' క్రీడాపోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జేఎన్‌టీయూ వీసీ జింకా రంగజనార్దన

అనంతపురం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల క్రీడా మైదానంలో అంతర్ జిల్లాల పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా పోటీలు గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జేఎన్‌టీయూ వీసీ డాక్టర్ జింకా రంగజనార్దన ముఖ్య అతిథిగా హాజరై, పోటీలను ప్రారంభించారు. గెలుపోటములను సమానంగా స్వీకరించి, క్రీడా స్ఫూర్తిని చాటాలని ఆకాంక్షించారు. చదువుతో పాటు ఆటపాటలకూ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఆర్‌డీటీ చైర్మన్ తిప్పేస్వామి, ఆర్జేడీ నిర్మల్‌కుమార్ ప్రియ, అధ్యాపకులు హాజరయ్యారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని 15 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 442 మంది క్రీడాకారులు హాజరయ్యారు.

ఆర్‌పీఎఫ్ ఓఎస్‌పై అట్రాసిటీ కేసు నమోదు

గుంతకల్లు: కులం పేరుతో దూషణలకు పాల్పడ్డాడన్న ఆరోపణలపై ఆర్‌పీఎఫ్ ఓఎస్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. ఈ మేరకు గుంతకల్లు డీఎస్పీ నర్సింగప్ప గురువారం వెల్లడించారు. డీఆర్‌ఎం కార్యాలయంలోని ఆర్‌పీఎఫ్ కమిషనర్ చాంబర్‌లో పనిచేస్తున్న ఆఫీస్ సూపరింటెండెంట్ మహబూబ్‌బాషాను మూడు రోజుల కిత్రం బదిలీ చేశారు. ఆ స్థానంలో శ్రీనివాసరావును నియమించారు. ఈ విషయంగా ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఆ సమయంలో తనను కులం పేరుతో మహబూబ్‌బాషా దూషించాడని శ్రీనివాసరావు చేసిన ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీకేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు డీఎస్పీ తెలిపారు.

దేవరకొండపై వ్యక్తి ఆత్మహత్యాయత్నం



బాధితుడిని ఎత్తుకు వస్తున్న కానిస్టేబుల్ శ్రీనివాసులు

బుక్కరాయసముద్రం: స్థానిక సిద్దరాంపురం రోడ్డులోని దేవరకొండపై ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేశాడు. వివరాలు.. అనంతపురం రూరల్ మండలం కందుకూరుకు చెందిన ఆకులేటి రమేష్‌బాబు.. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ సమీపంలోని కియా పరిశ్రమలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. భార్య, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. తల్లిదండ్రులతో ఆస్తి తగాదాలు ఉండడంతో మనస్తాపం చెందిన రమేష్‌బాబు... గురువారం కుటుంబసభ్యులతో గొడవపడి దేవరకొండపైకి చేరుకుని కిందకు దూకాడు. అక్కడే ఉన్న వాచ్‌మెన్ గమనించి సమాచారం అందించడంతో కానిస్టేబుల్ శ్రీనివాసులు, వీరనారప్ప అక్కడకు చేరుకుని పరిశీలించారు. అప్పటికే ముళ్ల పొదల్లో గాయాలతో పడి ఉన్న రమేష్‌బాబును గుర్తించి బయటకు తీసుకొచ్చి, 108 అంబులెన్స్ ద్వారా సర్వజనాస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పుట్టపర్తిలో దారుణం

- దంపతుల మధ్య చిచ్చుపెట్టిన 'అనుమానం'
- అడవిలోకి తీసుకెళ్లి భార్య గొంతుకోసిన భర్త
- చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న అనిత



కత్తి దాడికి గురైన అనితను కారులోకి ఎక్కిస్తున్న బాటసారులు

పుట్టపర్తి అర్బన్: ఐదేళ్ల కిత్రం పెళ్లి అయినా పట్టుమని పది నెలలు కూడా ఆ జంట సజావుగా కాపురం చేసింది లేదు. అనుమానం పెనుభూతంగా మారడంతో తరచూ గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలోనే కట్టుకున్న భార్యను కడతేర్చేందుకు యత్నించాడు భర్త. పుట్టపర్తి రూరల్ ఎస్‌ఐ కృష్ణమూర్తి వివరాలమేరకు.... నల్లమాడ మండలం కురుమాల గ్రామానికి చెందిన శ్రీనివాసులు కుమార్తె వి.అనితను అతని అక్క కుమారుడు (వరుసకు మేనమామ) అయిన గోరంట్ల మండలం కొలిమిపల్లికి చెందిన శివమ్మ, శంకరప్ప దంపతుల కుమారుడు రామాంజనేయులుకు ఇచ్చి ఐదేళ్ల క్రితం పెళ్లి జరిపించారు. కొంత కాలం సజావుగా సాగిన వీరి సంసారంలో అనుమానం పెనుభూతంగా మారింది. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ తరచూ గొడవపడేవారు. ఇందులో భాగంగానే గొడవ జరిగిన ప్రతిసారి అనిత పుట్టింటికి వెళ్లిపోయేది. పెద్దలు పంచాయితీ చేసి మళ్లీ భర్త దగ్గరకు పంపేవారు. ఇదే క్రమంలో 20 రోజుల క్రితం పుట్టింటికి వెళ్లిన అనిత పెద్దల ఒప్పందం మేరకు అత్తగారింటికి వచ్చింది. అయితే మరోమారు ఇద్దరి మధ్య గొడవ జరగడంతో గురువారం ఉదయం తిరిగి పుట్టింటికి వెళ్లేందుకు అనిత సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే రామాంజినేయులే భార్య అనితను పుట్టింటికి దిగబెడతానని నమ్మించాడు. కురుమాలకు వెళ్దామని చెప్పి ద్విచక్ర వాహనాన్ని అడవి గుండా తీసుకెళ్లాడు. పుట్టపర్తి మండలం దిగువచెర్లోపల్లి గ్రామ సమీపంలోని దట్టమైన అటవీ ప్రాంతానికి రాగానే రోడ్డు పక్కకు ద్విచక్ర వాహనాన్ని నిలిపి అనితను చెట్ల చాటుకు లాక్కెళ్లి కత్తితో గొంతు కోశాడు. పెనుగులాటలో చేతులను కూడా గాయపరిచాడు. ఈ సమయంలో రోడ్డుపై వెళ్తున్న కొందరు గమనించి కేకలు వేయగానే రామాంజినేయులు బైక్‌ను అక్కడే వదిలేసి పరారయ్యాడు. రక్తపు మడుగులో ఉన్న అనితను అటువైపుగా వచ్చిన ఓ కారులో గోరంట్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. బాధితురాలి పరిస్థితి విషమంగానే ఉందని, కేసు నమోదు చేసుకొని విచారణ చేపడతామని రూరల్ ఎస్‌ఐ కృష్ణమూర్తి తెలిపారు.

త్వరలో గొర్రెల పెంపకం యూనిట్లకు రుణాలు



మాట్లాడుతున్న వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రమణారెడ్డి (చిత్రంలో) లిఖిత

అనంతపురం అగ్రికల్చర్: నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ (ఎన్‌ఎల్‌ఎం) కింద అర్హత కలిగిన లబ్ధిదారులు గొర్రెల పెంపకం యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు రుణాలు అందించేలా త్వరలో విధి విధానాలు ఖరారు చేయనున్నట్లు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్ పర్సన్ ఎం.లిఖిత పేర్కొన్నారు. గురువారం స్థానిక డీసీసీబీలో జరిగిన కార్యక్రమంలో ఎన్‌ఎల్‌ఎం పథకం అమలుపై శ్రీసత్యసాయి జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, పశుశాఖ అధికారులు చర్చించారు. ఎన్‌ఎల్‌ఎం పథకం కింద ఎంపికైన వారికి 50 శాతం రుణ సదుపాయం కల్పించడానికి త్వరలో ఉమ్మడి జిల్లా అధికారులతో సమావేశమై ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. సమావేశంలో నాబార్డు డీడీఎం అనురాధ, డీసీసీబీ జీఎం సురేఖా రాణి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గ్రామాల్లో పశువైద్య శిబిరాలు



పశువులకు చికిత్సలు చేస్తున్న వైద్య సిబ్బంది

ఆత్మకూరు:మండలంలోని రంగంపేట, తోపుదుర్తిలో గురువారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశువులకు సంబంధించిన వ్యాధులకు చికిత్సలు చేశారు. పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్సలు నిర్వహించారు. కార్యక్రమంలో పశువైద్య డాక్టర్లు తులసీరాం, తేజశ్విని, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

సజావుగా వేలం పాట



వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో గురువారం టెంకాయలు అమ్ముకునే హక్కు కోసం వేలం నిర్వహించారు. వేలంలో టెంకాయలు అమ్ముకునే హక్కు రూ.1.60 లక్షలకు దక్కించుకున్నారు. ఈ ఏడాది రూ.50 వేలు ఎక్కువగా ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ అక్కిరెడ్డి తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారం



బోరు బావిలో నీరు వస్తున్న దృశ్యం

రాప్తాడు: మరూరు గ్రామ పంచాయతీలో చాపట్లలో తాగునీరు లేక కొంత కాలంగా గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి స్పందించి గ్రామంలో బోరును వేయించాలని ఆదేశించాడు. గురువారం వైఎస్సార్ సీపీ నాయకులు మాచిరెడ్డి చెన్నారెడ్డి, సూర్యనారాయణ రెడ్డి గ్రామ సమీపంలో బోరు వేయించారు. దాదాపుగా 3 ఇంచుల నీరు పడడంతో గ్రామంలో తాగునీటి సమస్య తీరడంతో చాపట్ల గ్రామ ప్రజలు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నిత్యావసర వస్తువుల వితరణ

అనంతపురం కల్చరల్: నిత్య సురభి చారిటబుల్ ట్రస్టు పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో ఐదు కుటుంబాలకు గురువారం నిత్యావసర వస్తువులు అందించారు. స్థానిక నాయక్‌నగర్‌లోని ఆశ్రమంలో వీటిని అందించినట్లు ఆశ్రమ నిర్వాహకులు డాక్టర్ నిర్మలా మురళీ తెలిపారు.

కేంద్రం దిగొచ్చేంత వరకూ సమ్మె



అనంతపురం హెడ్ పోస్టాఫీసు ఎదుట దీక్ష శిబిరంలో బైఠాయించిన జీడీఎస్ ఉద్యోగులు

అనంతపురం సిటీ: సమ్మెలో పాల్గొన్నా.. మద్దతు ఇచ్చినా కండక్ట్/ఎంగేజ్‌మెంట్ రూల్స్ ప్రకారం శాఖాపరమైన చర్యలు తీసుకుంటామంటూ తపాలా శాఖ ఉన్నతాధికారులు జీడీఎస్ ఉద్యోగులను బెదిరింపులకు దిగడం దుర్మార్గమని ఎన్‌యూజీడీఎస్ డివిజన్ కార్యదర్శి రామాంజనేయులు, ఏఐజీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి కృష్ణయ్య యాదవ్ మండిపడ్డారు. అనంతపురంలోని హెడ్ పోస్టాఫీస్ ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం మూడో రోజుకు చేరుకుంది. యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ తమ శాఖ ఉన్నతాధికారుల తీరును తప్పుబట్టారు. జిల్లా స్థాయిల్లోని కొందరు అధికారులు వాట్సాప్‌లలో జీడీఎస్ ఉద్యోగులను భయభ్రాంతులకు గురి చేస్తూ సందేశాలు పెట్టడాన్ని వారు వ్యతిరేకించారు. అధికారుల బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.

ఈ- క్రాప్ నమోదు చేయండి

గార్లదిన్నె: రబీ సీజన్‌కు సంబంధించి రైతులు సాగు చేసిన పంటలకు ఈ-క్రాప్ నమోదు చేయాలని డీఏఓ ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. గురువారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కంది పంటలో పంట కోత ప్రయోగాలు చేయాలన్నారు. అలాగే రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు ఎరువులు విక్రయాలు చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి సోమశేఖర్, ఏఈఓ స్రవంతి, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి మరో అవకాశం ఇవ్వండి

● ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



కార్యక్రమానికి హాజరైన 47వ డివిజన్ మహిళలు

అనంతపురం కార్పొరేషన్: రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మరో అవకాశం ఇవ్వాలని, సంక్షేమం, అభివృద్ధిని మరింత పెద్ద ఎత్తున చేపడతామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం 67 సచివాలయ పరిధిలోని రంగస్వామి నగర్‌లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. సంక్షేమ, అభివృద్ధి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. 64వ సచివాలయం పరిధిలో జరిగిన కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, కార్పొరేటర్ శాంతిసుధ సంక్షేమ, అభివృద్ధి, వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరించారు.

ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందించడమే తప్పా..ఎలాంటి రాజకీయాలు సీఎం చేయలేదన్నారు. డ్వాక్రా రుణాల మాఫీ చేస్తామని చంద్రబాబు మోసం చేశారని, ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.19వేల కోట్ల డ్వాక్రా రుణాలు మాఫీ చేశారని, వచ్చే ఏడాది ఫిబ్రవరిలో మరో రూ.6 వేల కోట్ల రుణాలు మాఫీ చేస్తారన్నారు. ఈ సచివాలయ పరిధిలో 1.28 కోట్లు రుణాలు మాఫీ అయ్యాయని, ఫిబ్రవరిలో మరో రూ.44 లక్షల రుణాలు మాఫీ చేయనున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది జనవరి నుంచి అనంతపురం నియోజకవర్గంలో మొత్తం కలుపుకొని (గతంలో ఉన్న పింఛన్లతో పాటు) 28 వేల మందికి పింఛన్ అందిస్తున్నట్లు తెలిపారు. మహిళల పేరు మీద 23 వేల కుటుంబాలకు ఇళ్ల పట్టాలను అందిస్తున్నట్లు తెలిపారు. నగరంలో రూ.800 కోట్ల అభివృద్ధి జరుగుతోందన్నారు. ఈ స్థాయిలో సంక్షేమం, అభివృద్ధి ఎవరైనా అందించారా?అందించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలన్నారు. త్వరలో తపోవనం బ్రిడ్జి, రంగస్వామి నగర్‌లోని ఓ రోడ్డును ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఇంటి వద్దకే ప్రజాప్రతినిధులు:

ప్రజా సమస్యల పరిష్కారం చూపేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో సొంతింటి వారే దూరంగా ఉన్న తరుణంలో సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల ప్రాణాలు కాపాడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. పేదలకు మంచి చేస్తున్న ప్రభుత్వంపై టీడీపీ, జనసేన, బీజేపీ, ఎల్లో మీడియా దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి మహిళా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గెలుపునకు కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు దుర్గాదేవి, టీవీ చంద్రమోహన్ రెడ్డి, శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నేతలు కొండ్రెడ్డి ప్రకాష్ రెడ్డి, చింతా సోమశేఖర్ రెడ్డి, మధు, రమణారెడ్డి, రాధాకృష్ణ,సైపుల్లా బేగ్,రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పనితీరుపై ఎస్‌ఐకు ప్రశంస

నార్పల: నార్పల ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి జిల్లా ఎస్పీ అన్బురాజన్ చేతుల మీదుగా గురువారం ప్రశంసా పత్రం అందుకున్నారు. ఇటీవల మండలంలో మహిళ మిస్సింగ్, చోరీల కేసుల్లో ఎస్‌ఐ రాజశేఖర్ రెడ్డి ఉత్తమ పనితీరును కనబర్చారు. దీంతో గురువారం జిల్లా కేంద్రంలో ఎస్పీ ఎస్‌ఐ రాజశేఖరరెడ్డికి ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు.

యాడికి: దొంగతనాలు నియంత్రణ, మిస్సింగ్ కేసుల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన యాడికి పోలీసు భూపతిరాజును గురువారం అనంతపురంలో జిల్లా ఎస్పీ అనురాజన్ ప్రశంసాపత్రాన్ని అందజేసినట్లు ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. భూపతి రాజుకు ప్రశంసాపత్రం రావడంతో సీఐ శంకర్‌రెడ్డి ,యాడికి పోలీసులు అతడిని అభినందించారు.

సౌత్‌జోన్ ఫుట్‌బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

గుంతకల్లుటౌన్: ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకు తమిళనాడులోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్ ఫుట్‌బాల్ పోటీలకు ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీకామ్ ఫైనలియర్ విద్యార్థి సి.వెంకటేష్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య తెలిపారు. గురువారం కళాశాలలో ఫుట్‌బాల్ క్రీడాకారుడు వెంకటేష్‌ను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

జన రంజక పాలనను స్వాగతించండి



పి.యాలేరులో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ప్రజా ప్రతినిధులు, నాయకులు

ఆత్మకూరు: గత డీటీపీ ప్రభుత్వంలో ఎన్నో మోసపూరిత హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించారని ఎంపీపీ హేమలత తెలిపారు. గురువారం పి.యాలేరులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన మా నమ్మకం నువ్వే జగన్ బోర్డును ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ పి.యాలేరు గ్రామానికి రూ.40 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయని తెలియజేశారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రభుత్వం తెచ్చిన జలకళ పథకం ద్వారానే కాకుండా తోపుదుర్తి ట్రస్ట్ ద్వారా ఎన్నో వేల ఉచిత బోర్లు వేయించారని తెలిపారు. పేరూరు డ్యాంకు నీరు తీసుకొచ్చి రైతుల కల నెరవేర్చారని తెలిపారు. అనంతరం పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ జెండాలతో ర్యాలీ చేశారు. ఎస్సీ కాలనీ దగ్గర వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బాల పోతన్న, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ నరసింహారెడ్డి, ఎలక్షన్ మండల ఇన్‌చార్జ్ గోపాల్‌రెడ్డి, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, వైస్ ఎంపీపీ నీలిమ, విజయ్, సర్పంచులు ఆరోగ్యంరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, నాయకులు అతిక్‌రెడ్డి, నరసింహులు, సుబ్బారెడ్డి, బాలస్వామిరెడ్డి, వెంకటేష్, మురళి , ఎర్రితాత, అశోక్, బాబయ్య, జయన్న, నారాయణప్ప, ఆంథోనిరెడ్డి, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల మూతతో చిన్నారుల అవస్థలు



అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు అడుగుతున్న మండల స్థాయి అధికారులు

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా డిమాండ్లు పరిష్కారించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె చేస్తుండడంతో సెంటర్లు మూత పడ్డాయి.దీంతో సెంటర్లకు వచ్చే చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందలేదు. దీంతో గురువారం ఎంపీడీఓ రఘునాథ్, ఏపీఎం మదన్‌మోహన్, ఎంఈఓలు నరసింహారెడ్డి, రామాంజనేయులు, సూపర్‌వైజర్లు లావణ్య,శ్రీవాణి అంగన్‌వాడీ కార్యకర్తలకు నచ్చజెప్పి, సెంటర్ల తాళాలు ఇవ్వాలని కోరారు. డిమాండ్లు నెరవేరే వరకూ సెంటర్లు తెరిచేదిలేదని చెప్పడంతో అధికారులు వెనుదిరిగారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో మొత్తం 11 అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు భోజనం ఏర్పాటు చేయించారు. శుక్రవారం నుంచి దగ్గర లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో అంగన్‌వాడీ చిన్నారులకు భోజనం ఏర్పాటు చేయిస్తామని, పాఠశాలలు అందుబాటులో లేని చోట వెలుగు సంఘం సభ్యుల ద్వారా చిన్నారులకు భోజనం అందిస్తామని ఎంపీడీఓ తెలిపారు.

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

అనంతపురం అర్బన్: తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సంఘం ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు గురువారం కలెక్టరేట్ వద్ద 36 గంటల వంటావార్పు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగమణి మాట్లాడుతూ ఆశావర్కర్లకు కనీస వేతనం చెల్లించాలన్నారు. పని భారాన్ని తగ్గించాలని, మొబైల్ వర్క్ శిక్షణ ఇవ్వాలన్నారు. రూ.10 లక్షలు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. పీహెచ్‌సీల్లో క్లీనింగ్ పనులను ఆశాలతో చేయించరాదన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని, ప్రభుత్వ సెలవులు, వైద్య సెలవులు, వేతనంతో కూడిన ప్రసూతి సెలవు అమలు చేయాలన్నారు. కోవిడ్ సమయంలో మరణించి ఆశాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. తదితర డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు.

ఇంధనాన్ని పరిరక్షించుకోవాలి

బుక్కరాయసముద్రం: ఇంధనాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని బోర్డ్ ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్ (బీసీడీఈ) ప్రతినిధి కవిన్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ బోర్డ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్ (బీసీడీఈ) సహకారంతో ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ అరవింద్ బాబు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, టీపీఓ రంజిత్‌రెడ్డి, ఈఈఈ విభాగం అధిపతి డాక్టర్ మేరీమాత సెకండియర్ ఈఈఈ విభాగం విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయం ఆకస్మిక తనిఖీ

గుత్తి: పట్టణంలోని శాఖా గ్రంథాలయాన్ని గురువారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె అన్ని రకాల రికార్డులను పరిశీలించారు. రోజూ గ్రంథాలయానికి ఎంత మంది పాఠకులు వస్తున్నారు, వారికి జర్నల్స్, వార్తా పత్రికలు వంటివి అందుబాటులో ఉన్నాయా లేదా అనే విషయాలపై ఆరా తీశారు. గ్రంథాలయం, సౌకర్యాలపై పాఠకులను అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయాధికారి రామాంజనేయులు, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

గుత్తి: పట్టణంలోని ఎంఎస్ డిగ్రీ కాలేజీలో గురువారం ప్రిన్సిపాల్ నీలిమా ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి క్రిస్మస్ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు అన్వర్,షెక్షావలి, జాషువా, రమణ, ఆఫీస్ సూపరింటెండెంట్ బింగి కిరణ్‌బాబు, సత్యనారాయణరెడ్డి, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.5.78 లక్షల ఆదాయం

తాడిపత్రిటౌన్: ఆలూరు కోన రంగనాథస్వామి ఆలయంలో గురువారం నిర్వహించిన వేలం పాటల ద్వారా రూ 5.78 లక్షలు ఆదాయం వచ్చిందని ఈఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షణాధికారి శోభారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతికి అండగా నిలుద్దాం



జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీపీ వరలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ రాధమ్మ

రాప్తాడురూరల్: దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట వేశారని అనంతపురం రూరల్ ఎంపీపీ వరలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ రాధమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు ధనుంజయయాదవ్ పేర్కొన్నారు. గురువారం అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీ సిండికేట్ నగర్‌లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం సచివాలయ పరిధిలో సంక్షేమ పథకాల లబ్ధిదారుల సంఖ్య, చేసిన ఖర్చుకు సంబంధించిన డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. భవిష్యత్తులోనూ బడుగు, బలహీన వర్గాలకు మరింత మేలు జరుగుతుందన్నారు. అన్ని వర్గాలకు అండగా నిలిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బండా అంజియాదవ్, రాచానపల్లి పీఏసీఎస్ చైర్మన్ గుగ్గిళ్ల జయకృష్ణారెడ్డి, నాయకులు రమణారెడ్డి, సూర్యనారాయణరెడ్డి, రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాల్లో సౌకర్యాలు మెరుగు



మాట్లాడుతున్న ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ

కనగానపల్లి: ప్రజలకు వైద్య సేవలు సక్రమంగా అందేలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సౌకర్యాలను మరింత మెరుగు పరుస్తున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్ఓ సెల్వియా సోలమన్ తెలిపారు. గురువారం స్థానిక పీహెచ్‌సీలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి డిప్యూటీ డీఎంహెచ్ఓ, మండల స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. ఆరోగ్య కేంద్రంలో అభివృద్ధి పనులు, సౌకర్యాలపై చర్చించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందాలంటే సరైన సౌకర్యాలతో పాటు ఆరోగ్య సిబ్బంది సక్రమంగా పనిచేయాలని ఎంపీపీ తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ అలివేలమ్మ, సర్పంచ్ అంకే పరిమళ, పీహెచ్‌సీ డాక్టర్ చెన్నారెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఏపీఎల్‌లో గుంతకల్లు ఆర్డీటీ జట్టు హవా

గుంతకల్లు: అనంత ప్రీమియర్ లీగ్(ఏపీఎల్)లో గుంతకల్లు ఆర్డీటీ జట్టు వరుసగా నాలుగో విజయాన్ని సాధించింది. గురువారం పట్టణంలోని శ్రీ శంకరానంద డిగ్రీ కళాశాల మైదానంలో గుంతకల్లు, బుక్కరాయసముద్రం ఆర్డీటీ జట్లు 25 ఓవర్ల మ్యాచ్‌లో తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన బుక్కరాయసముద్రం జట్టు 14.4 ఓవర్లలో కేవలం 29 పరుగులకే ఆలౌట్ అయింది. గుంతకల్లు ఆర్డీటీ జట్టులోని బౌలర్ నందిని బటన్‌పాడు 4 వికెట్లు, జాహ్నవి 3 వికెట్లు, కీర్తన, ధరణి, భువనేశ్వరి చెరో వికెట్ తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన గుంతకల్లు ఆర్డీటీ జట్టు ఒక వికెట్ కోల్పోయి కేవలం 3.1 ఓవర్లలో 30 పరుగులు చేసి ఘన విజయం సాధించింది.

క్రీడాకారుడికి ఎమ్మెల్యే అభినందన



శివతేజను అభినందిస్తున్న ఎమ్మెల్యే అనంత

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో క్రీడాకారుడు శివతేజను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి గురు వారం అభినందించారు. 'ఆడుదాం ఆంధ్రా'లో భాగంగా శ్రీకాకుళం జిల్లా యలమంచిలో జరిగిన మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్ రాష్ట్ర స్థాయిలో పోటీల్లో జిల్లాకు చెందిన శివతేజ చారుగుండ్ల తృతీయ స్థానంలో నిలిచాడు. ఇదే స్ఫూర్తితో ముందు మరిన్ని విజయాలు సాధించాలని ఎమ్మెల్యే తెలిపాడు.

స్టేట్ బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ

బుక్కరాయసముద్రం: వెంకటాపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలలో ప్రతిభ కనబరిచారని పాఠశాల ప్రిన్సిపాల్ దిల్‌కుష్, పీడీ వరలక్ష్మి తెలిపారు. ఇటీవల విజయనగరంలో జరిగిన పోటీల్లో వందన, నఫిత్ కౌసర్ ప్రతిభ కనబరిచి సిల్వర్ మెడల్ సాధించారన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన అవసరం

బుక్కరాయసముద్రం: కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని మండల స్పెషలాఫీసర్ శ్రీదేవి పేర్కొన్నారు. గురువారం కొర్రపాడు గ్రామంలో భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషలాఫీసర్ కేంద్రం ప్రవేశ పెట్టిన పథకాలను వివరించారు. ఎంపీడీఓ తేజోత్స్న, ఉప సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, ఎంఈఓ లింగానాయక్, ఏఓ శ్యాం సుందర్‌రెడ్డి, సైనికాధికారి చిరంజీవిరెడ్డి, వికసిత్ భారత్ సంకల్ప్ కోఆర్డినేటర్ సాయినాథ్‌రెడ్డి, ఈఓఆర్డీ దామోదరమ్మ పాల్గొన్నారు.

ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడిగా దివాకర్

అనంతపురం: ఏబీవీపీ (అఖిల భారత విద్యార్థి పరిషత్) ఏపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా దివాకర్ నాయక్‌ను ఎంపిక చేశారు. న్యూఢిల్లీలో ఇటీవల జరిగిన 69వ జాతీయ మహాసభల్లో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అక్కడ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడిగా మురళీధర్‌రావును ఎంపిక చేయగా, శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ అధ్యక్షుడు దివాకర్ నాయక్‌ను రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడిగా ఎంపిక చేసినట్లు ఆ శాఖ రాష్ట్ర కార్యదర్శి యాచంద్ర మంగళవారం తెలిపారు.

జనసేన నాయకుల దుష్ప్రచారం తగదు



మాట్లాడుతున్న మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం, కార్పొరేటర్లు

అనంతపురం కార్పొరేషన్: జనసేన పార్టీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మరని మేయర్ వసీం అన్నారు. ఎన్టీఆర్ మార్గ్‌లో మొక్కల సంరక్షణలో అవినీతి జరిగిందంటూ జనసేన నాయకుల ఆరోపణలను తప్పుబడుతూ మేయర్ వసీం గురువారం నగరపాలక సంస్థలో విలేకరుల సమావేశంలో ఏర్పాటు చేశారు. మేయర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ అవినీతిమయంగా మార్చేశారని జనసేన నాయకులు విమర్శించడం సరికాదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అవినీతికి ఆస్కారం లేకుండా పారదర్శకంగా పెద్ద ఎత్తున సంక్షేమం, అభివృద్ధి చేపట్టామన్నారు. టెండర్‌లోని నిబంధనల మేరకే మొక్కలను నాటినట్లు తెలిపారు. నగర సుందరీకరణలో భాగంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో రూ.71 లక్షలతో మొక్కలు, ట్రీ గార్డ్స్ తదితర వాటిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. టెండర్ ప్రకారం మొక్కలు, వాటి సంరక్షణ చేపట్టేలా తాము పటిష్ట చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నగరంలో రూ.800 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టిన విషయాన్ని మేయర్ గుర్తు చేశారు. తమ ప్రభుత్వంపై ఎవరెన్ని కుట్రలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్టీఆర్ మార్గ్‌లో మొక్కల సంరక్షణలో పలువురు అధికారుల తప్పులను కౌన్సిల్‌లో లేవనెత్తినట్లు తెలిపారు. అభివృద్ధి పనులు పారదర్శకంగా చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో కార్పొరేటర్లు ఇసాక్, మల్లెమీద నరసింహులు, అనిల్‌కుమార్ రెడ్డి, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్, తదితరులు పాల్గొన్నారు.

'అనంత సంకల్పం' రీ షెడ్యూల్ చేయండి



డీఈఓ నాగరాజుకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతశాతం పెంచేందుకు విద్యాశాఖ తీసుకొచ్చిన 'అనంత సంకల్పం' అమలుకు రీ షెడ్యూల్ చేయాలని ఏపీటీఎఫ్ (1938) నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి నాగరాజుకు వినతి పత్రం అందించారు. అనంత సంకల్పం షెడ్యూల్‌లో పాఠశాల పని దినాల్లోనే కాకుండా సెలవు రోజుల్లో కూడా ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. డీఈఓను కలిసిన వారిలో ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి కులశేఖర్ రెడ్డి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవీంద్ర , శ్రీనివాసరెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షుడు రామానాయక్, రాష్ట్ర కార్యదర్శి ఏ విశ్వనాథ్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహమ్మద్ రఫీ, ముఖ్య సభ్యులు శ్రీనివాసనాయక్, షమీముల్లా, గోవిందరెడ్డి, అంజనేయనాయక్, వీరాంజనేయులు, అశోక్ నాయక్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి అంగన్‌వాడీ కేంద్రాలు పని చేయాలి



అంగన్‌వాడీ చిన్నారులకు పాఠశాలలో భోజనం ఏర్పాటు చేసిన అధికారులు

రాప్తాడు: మండలంలో అంగన్‌వాడీ కేంద్రాలు శుక్రవారం నుంచి పని చేయాలని ఎంపీడీఓ సాల్మన్ ఆదేశించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తమ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఈ నెల 12 నుంచి సమ్మెలోకి వెళ్లిన విషయం విదితమే. రాష్ట్ర ప్రభుత్వం అంగన్ వాడీ కేంద్రాలు తెరవాలని ఆదేశించడంతో గురువారం మండల స్థాయి అధికారులు అంగన్‌వాడీ కార్యకర్తలకు ఫోన్లు చేయగా, చాలా మంది కార్యకర్తలు తమ మొబైళ్లను స్విచ్ ఆఫ్ చేసుకున్నారు. మిగిలిన వాళ్ల ఫోన్లు లిఫ్ట్ చేయడం లేదు. దీంతో మండల స్థాయి అధికారులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల సమీపంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలకు ఆయా పాఠశాలలో భోజనం పెట్టించారు. ఎంపీడీఓ సాల్మన్ మాట్లాడుతూ మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు ఉదయం 9 గంటలకే తెరవాలన్నారు.

కరువు సహాయక చర్యలు చేపట్టాలి

అనంతపురం అర్బన్: జిల్లాలో కరువు తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని సీపీఐ నాయకులు కలెక్టరేట్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున మాట్లాడారు. కరువు కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. పనులు లేక వ్యవసాయ కూలీలు వలసపోవాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి కరువు సహాయక చర్యలు చేపట్టాలన్నారు. రైతులకు ఎకరాకు రూ.50 వేలు పరిహారం ఇవ్వాలన్నారు. వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు విరివిగా కల్పించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి, నాయకులు శ్రీరాములు, రామకృష్ణ, నారాయణస్వామి, రాజేశ్‌గౌడ్, అల్లిపీరా, తదితరులు పాల్గొన్నారు.